సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 8 । నవంబర్ । 2024





## వింటర్‌లో రివ్వు రివ్వున..

వైజాగ్ ఎయిర్‌పోర్ట్ వింటర్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది మరో మూడు విమానాలు అందుబాటులోకి రానున్నాయి. 8లో



## ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు.



## జూ కొలనుకు జలకళ

విశాఖ: ఇందిరాగాంధీ జూ పార్కులోని కొలను ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో కళకళలాడుతోంది.

## న్యూస్‌రీల్

### మద్యం తాగి కోర్టులో సాక్ష్యం.. నిందితుడికి ఒకరోజు జైలు

అనకాపల్లి: హత్య కేసులో సాక్ష్యం చెప్పడానికి మద్యం తాగి కోర్టుకు వచ్చిన సబ్బవరం మండలానికి చెందిన గొర్లి సత్తిబాబుకు 11వ అడిషనల్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఎ.రమేష్ ఒకరోజు జైలు శిక్ష, రూ.50ల జరిమానా విధించినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ గురువారం చెప్పారు. సీఐ అందించిన వివరాలు... సబ్బవరంలో జరిగిన హత్యకేసులో సాక్ష్యం చెప్పడానికి సబ్బవరం మండలం అదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి గొర్లి సత్తిబాబు గురువారం 10వ అడిషనల్ సెషన్స్ కోర్టుకు వచ్చాడు. అతను మద్యం మత్తులో ఉన్నట్టు గమనించిన న్యాయమూర్తి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి 11వ అడిషనల్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి వద్ద హాజరు పర్చగా పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ చెప్పారు. గొర్లి సత్తిబాబును అనకాపల్లి సబ్‌జైల్‌కు తరలించామన్నారు.

### రీసర్వే అభ్యంతరాలపై పూర్తి స్థాయి విచారణ

- బెల్ట్ షాపులపై కఠిన చర్యలు
- కలెక్టర్ ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: రెవెన్యూ గ్రామ సభల్లో రీసర్వే అభ్యంతరాలపై వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన అర్జీలపై తహసీల్దార్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమస్యల పరిష్కారానికి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో గనుల అక్రమ తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం షాపులపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించకుండా అరికట్టాలని, అందుకు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, మైనింగు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ హోంగార్డుకు సహోద్యోగుల బహుమతి



హోంగార్డు అప్పారావుకు రూ.3.82 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: యలమంచిలి టౌన్ పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన అప్పారావుకు సహచర హోంగార్డులు తమ ఒక రోజు డ్యూటీ అలవెన్సును బహుమతిగా ఇచ్చారు. వారు అందించిన రూ.3,82,690లను చెక్కు రూపంలో ఎస్పీ తుహిన్ సిన్హా అప్పారావుకు గురువారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హోంగార్డులు ఉద్యోగ విరమణ సందర్భంలో, ప్రమాదాల బారిన పడిన సమయంలో ఒకరోజు డ్యూటీ అలవెన్సును తోటి హోంగార్డుకు అందజేయడం అభినందనీయమన్నారు.

### 11 నుంచి పోలీస్ ఉద్యోగాల భర్తీకి స్టేజ్-2 దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి: పోలీస్ ఉద్యోగాల భర్తీలో ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించి ఫిజికల్ మెజర్‌మెంట్ పరీక్షలకు, ఫిజికల్ ఎఫిషియెన్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు స్టేజ్-2 దరఖాస్తుఫారంను ఆన్‌లైన్‌లో ఈనెల 11 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నమోదు చేసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే స్టైఫెండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ సివిల్ (పురుషులు, మహిళలు), ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుల్ ఏపీఎస్పీ (పురుషులు) పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది డిసెంబర్ చివరి వారంలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పని వేళలో 9441450639, 9100203323 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

దేశ రక్షణ కోసం నేవల్ బేస్ ప్రాజెక్టు రావడం మంచిదే అయినా.. రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో దాదాపు 6 గ్రామాలకు చెందిన మత్స్యకారులకు మాత్రం పూట గడవడమే ఇబ్బందిగా మారింది. వేటకు వెళితే గానీ కడుపు నిండని బతుకులు వారివి. నేవల్ బేస్ ప్రాజెక్టు కోసం గోడ నిర్మాణం చేపడితే చేపల వేటకు వెళ్లేందుకు అడ్డుకట్ట పడుతుంది. 18 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టు మంజూరైన సమయంలో నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చి.. వారికి పునరావాసం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ ఇప్పటివరకూ ప్యాకేజీ కాదు కదా పునరావాసం కూడా కల్పించలేదు. రాంబిల్లి మండలంలో కొంతమేర ముందడుగు పడినా మరో ఐదు గ్రామాలకు ప్యాకేజీ ఇవ్వలేదు. ఎస్.రాయవరం మండలంలో బంగారమ్మపాలెం గ్రామ మత్స్యకారులు ఇటీవల రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసిన తరువాతనే గోడ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సర్వే ప్రక్రియను నిలిపివేశారు.



శారదా నది నీటిని దిగ్బంధించి రాంబిల్లి మండలం వైపు కట్టిన నేవీ గోడ.. దీని వల్ల నదీ జలాలు సముద్రంలో కలవకుండా మత్స్యకార గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి

■ కానరాని ప్రత్యామ్నాయం.. పునరావాసం..

# ఎలా సాగించాలి జీవనం?

- నేవీ వచ్చి తమ పొట్ట కొట్టిందంటూ మత్స్యకారుల ఆవేదన
- ఫెన్సింగ్ బౌండరీ నిర్మాణంతో వారి బతుకులు తలకిందులు
- చేపల వేటకు అవకాశం లేక ఉపాధి కోల్పోతున్న 6 గ్రామాల గంగపుత్రులు
- రాంబిల్లి మండలంలో పూర్తి కావచ్చిన గోడ నిర్మాణం
- ఎస్.రాయవరం మండలంలో రెవెన్యూ అధికారుల సర్వేను అడ్డుకున్న నిర్వాసితులు
- పరిహారం అందించి, ప్రత్యామ్నాయం చూపించాకే గోడ నిర్మించాలని డిమాండ్



రాంబిల్లి మండలంలో నేవీ నిర్మించిన వివాదాస్పద గోడ

సాక్షి, అనకాపల్లి: నేవల్ బేస్ ప్రాజెక్ట్ కారణంగా రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని ఆరు గ్రామాల పరిధిలో 5 వేల కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయింది. భూములు, చెట్లు, పుట్టలు, గట్లు కోల్పోయి నిర్వాసితులకు పూట గడవటం ప్రశ్నార్థకంగా మారింది. జీవనాధారమైన కొండలను సైతం నేవీ అధికారులు స్వాధీనం చేసుకుని ఆయా గ్రామాల చుట్టూ దారులు మూసి ప్రహరీ నిర్మించడం వల్ల వారి బతుకులు ఛిన్నాభిన్నమయ్యాయి. తమ సమస్యలపై నిరసనలు, ధర్నాలు చేపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లిపోతున్నారే తప్ప ప్యాకేజీ, ప్రత్యామ్నాయ ఉపాధి చూపడం లేదని వాపోతున్నారు. రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 6 గ్రామాల మత్స్యకారులకు, 5 వేల కుటుంబాలకు అండగా ఉండే కొండలవి. పశుగ్రాసం, వంటచెరకు, కలప, గ్రావెల్ వంటి సంపదతో హాయిగా బతికేవారు. ఇప్పుడు వాటిని కోల్పోవడంతో ఒక్కసారిగా వారి బతుకు తలకిందులైంది. ఉన్న పళంగా ఉపద్రవం ముంచుకొచ్చినట్టుగా నేవల్ బేస్ ప్రాజెక్టు రావడంతో సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపకపోడవం.. పునరావాసం కల్పించకపోగా.. ప్యాకేజీ ఇచ్చిన పాపాన పోలేదు. రాంబిల్లి మండలంలో శారదానదిని ఆనుకుని నిర్మిస్తున్న నేవీ ప్రహరీ నిర్మాణంతో సుమారుగా 6 గ్రామాల మత్స్యకారులు జీవనాధారం కోల్పోతున్నారు. నిర్వాసితులకు ఉపాధితో పాటు పునరావాసం కల్పిస్తామని 18 ఏళ్ల క్రితం భూములు సేకరించారు. ప్యాకేజీ ప్రకటనలకే పరిమితమైంది. రాంబిల్లి మండలంలో ఇప్పటికే నేవల్ బేస్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎస్.రాయవరం మండలంలో గల బంగారమ్మపాలెం వద్ద కూడా గోడ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. వారం రోజుల క్రితమే స్థానిక మత్స్యకారులు, ప్రజలు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తమకు పునరావాసం, ప్యాకేజీ కల్పించిన తరువాతే నిర్మాణం చేపట్టాలని అభ్యర్థించారు.

### మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఏదీ?

ఎస్.రాయవరం, రాంబిల్లి మండలంలో సముద్ర తీర ప్రాంతంలో చేపలు పట్టుకుంటూ బంగారమ్మపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలు జీవనం సాగించేవారు. ఇప్పుడు నేవల్ బేస్ రాకతో వారికి ఉపాధి పోయింది. ప్రత్యామ్నాయంగా మరోచోట ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో నేవల్ బేస్ ప్రభావం వల్ల మత్స్యకార గ్రామాల ప్రజలు ఉపాధి కోల్పోయామని ధర్నాలు చేశారు. వారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్యాకేజీలు అందజేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకార జీవన భృతి ఇవ్వలేదు. ఉపాధి కల్పించలేదు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

### గ్రామాలకు నీటి ముంపు సమస్య

నేవల్ బేస్ ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలైన బంగారమ్మపాలెం, కొత్తపేట, కొప్పుగొండుపాలెం, చినకలవలపల్లి, పెదకలవాలాపల్లి, వై.లోవ గ్రామాల్లోని ప్రజలు కొండలపై పాకలు వేసుకొని పశువులు మేపుకుంటూ జీడి, కొబ్బరి, తదితర చెట్లు పెంచుకుంటూ జీవనం సాగించేవారు. నేవీ ప్రహరీ నిర్మాణం వల్ల ఇప్పుడు వాటిని కోల్పోయారు. పశుగ్రాసం కొరతతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొండల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల ప్రకృతి విపత్తుల సమయంలో శారదానది ఉప్పొంగి పెదకలవలా పల్లి, వై.లోవ గ్రామాలు నీటి ముంపునకు గురవుతున్నాయి. పొలాలు శారదానది ఆవల ఉండటం వల్ల పుట్టీల సహాయంతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### ప్రత్యామ్నాయం చూపండి



ప్రభుత్వం నేవల్‌బేస్ నిర్మాణం కోసం కేటాయించిన భూమికి సరిహద్దుగా గోడ నిర్మాణం చేస్తే చేపలు వేట చేసుకునేందుకు మార్గం లేదు. ఇప్పటికే నిర్మాణ పనుల వల్ల చేపల వేటకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు గోడ నిర్మిస్తామంటున్నారు. మాకు ప్రత్యామ్నాయ మార్గం చూపించి పనులు చేసుకోవాలి.

– మైలపల్లి రాజారావు, నేవల్‌బేస్ నిర్వాసితుడు, బంగారమ్మపాలెం, ఎస్.రాయవరం మండలం

### పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



నేవల్‌బేస్ కోసం గోడ నిర్మాణం చేపడితే చేపల వేటకు అవకాశంలేదు. మాకు శాశ్వత పరిష్కారం చూపి, గోడ నిర్మాణం చేపట్టాలి. 18 ఏళ్లుగా నేవల్ బేస్ నిర్వాసితులుగా పలు రకాల సమస్యలు పెండింగ్‌లో ఉంచారు. అవి కూడా పరిష్కరించాలి. అంతవరకు అధికారులు సంయమనం పాటించాలి.

–సూరాడ నూకరాజు, మత్స్యకారుడు, బంగారమ్మపాలెం, ఎస్.రాయవరం మండలం

### ఉపాధి పోయింది



పెదకలవలాపల్లి, వై లోవ గ్రామాల మీదుగా నేవల్‌బేస్ ప్రాజెక్ట్ రక్షణ గోడను నిర్మిస్తున్నారు. ఈ గోడ నిర్మాణం వలన మా గ్రామాల్లో కొండవాలు ప్రాంతంలో జీడితోటలు, కొబ్బరితోటలు, పశువుల పాకలు పోయి స్థానికంగా ఉన్న పేద ప్రజలు ఉపాధిని కోల్పోయారు. ప్రభుత్వం వెంటనే రాంబిల్లి మండలంలో నేవీ నిర్వాసితులకు ప్యాకేజీ అందజేయాలి.

-రావి దేముళ్లు, పెదకలవలాపల్లి గ్రామం, రాంబిల్లి మండలం

## పేకాట పోలీసులపై ఎస్పీ ఆరా!

- తప్పు ఒప్పుకోవాలని ఆదేశం
- లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆ సీఐ, ఎస్‌ఐ గుండెల్లో రైళ్లు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అనకాపల్లి: పేకాట శిబిరాలపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న నగదులో సగం నొక్కేసిన ఖాకీల వ్యవహారం ఇప్పుడు జిల్లా పోలీస్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. వీరిపై ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. దీపావళికి ముందు పోలీసులు పలు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో రూ.24 లక్షల వరకు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదులో రూ.12 లక్షలు మాత్రమే చూపించి.. మిగిలిన రూ.12 లక్షలను ఒక సీఐ, ఎస్‌ఐ నొక్కేశారు. సాక్షి ప్రచురించిన కథనంతో ఎస్పీ తుహిన్ సిన్హా ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు తెలిసింది. పేకాటరాయుళ్ల నుంచి సొమ్ము నొక్కేసిన వారి కోసం విచారిస్తున్నట్లు సమాచారం. తప్పు చేసిన వారు ఒప్పుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు సీఐ, ఎస్‌ఐ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. దీని నుంచి బయటపడేందుకు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఇంటి వద్దనే ఈ-కేవైసీ

- గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా చేసే ఏర్పాటు
- అనుసంధానం చేసుకుంటేనే దీపం లబ్ధి: జేసీ



జేసీ జాహ్నవి

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకం లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి చెప్పారు. తెలుపు రేషన్ కార్డు కలిగిన గ్యాస్ వినియోగదారులందరూ ఈ పథకానికి అర్హులేనని, అయితే ఈ-కేవైసీ అనుసంధానం జరిగితేనే లబ్ధి పొందగలరని చెప్పారు. ఈ-కేవైసీ చేయించని వారు ఆందోళన చెందవద్దని, గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా వినియోగదారుని ఇంటి వద్దనే ఈ-కేవైసీ చేయించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీపం-2 పథకంపై అవగాహన కోసం ఆమె పలు అంశాల గురించి వివరించారు. జిల్లాలో దీపం, ఉజ్వల-1, ఉజ్వల-2, సీఎస్సార్ (స్త్రీ), తెలుపు రేషన్ కార్డు కలిగిన సాధారణ గ్యాస్ వినియోగదారులు 5,17,081 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశామన్నారు. వారిలో ఈ-కేవైసీ పూర్తయిన 3,60,000 మందిని దీపం-2 పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఈ-కేవైసీ ద్వారా గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానమైన వారికి మాత్రమే నగదు రిఫండ్ జరుగుతుందని చెప్పారు. డెలివరీ బాయ్ గ్యాస్ సిలిండర్‌తో ఇంటికి వచ్చినప్పుడు ఈ-కేవైసీ (ఫేస్ రికగ్నిషన్) చేసుకోవచ్చన్నారు. జిల్లాలో దీపం-2 పథకం అమలు చురుగ్గా జరుగుతోందని, ఈనెల 6వ తేదీ వరకు బుక్ చేసుకున్న 61,838 మందిలో 50 శాతం అనగా 31,168 మందికి ఉచితంగా సరఫరా చేయడం జరిగిందన్నారు. దీపం-2 పథకం అమల్లో ఇబ్బందులు, సూచనలు టోల్‌ఫ్రీ నెం.1967కు తెలపవచ్చని చెప్పారు. ఇబ్బందులుంటే సచివాలయం, పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. పౌరసరఫరా శాఖ 24 గంటల్లో ఇబ్బందిని పరిష్కరిస్తుందని చెప్పారు.

● అదానీ హైడ్రో పవర్‌ప్లాంట్‌కు అనుమతులిస్తే ప్రతిఘటన

## గిరిజనుల వినూత్న నిరసన



విల్లు చేతపట్టి వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి: అదానీ హైడ్రో పవర్‌ప్లాంట్‌కు అనుమతులిస్తే ప్రత్యక్ష ప్రతిఘటన తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని నగరంపాలెంలో హైడ్రో ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని గురువారం స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. గిరిజనుల సంప్రదాయ ఆయుధం విల్లులు చేతపట్టి వినూత్న రీతిలో గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీశాఖ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం నేతలు వెంకన్న, దొర మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు ఇటీవల అదానీ కంపెనీ ఏజెంట్లతో కలిసి రహస్యంగా సర్వే చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్‌ప్లాంట్ వద్దని గత కొంతకాలంగా గిరిజనులు ఆందోళనలు చేస్తుంటే, రహస్య సర్వే ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. నగరంపాలెం గ్రామానికి జల్‌జీవన్ మిషన్ పథకంలో మంచినీటి పనులకు నిధులు మంజూరు చేస్తే, ఫారెస్టు ఏరియా ఉందని అడ్డగించిన అటవీశాఖ అధికారులు దట్టమైన ప్రాంతాన్ని అదానీకి ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. అదానీ కన్ను రైవాడ, కోనాం ప్రాజెక్టులపై పడిందని, జలాశయాలను కాపాడుకునేందుకు ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్‌ప్లాంట్ నిర్మించాలంటే గిరిజనుల అనుమతితోపాటు గ్రామసభ తీర్మానం అవసరమన్నారు. పీసా, అటవీ హక్కులు, 1/70 తదితర చట్టాలను ధిక్కరించి ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు.

## సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంతవాసులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. రూ.67.35 కోట్లతో నిర్మించే 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను 220 కేవీ స్థాయికి పెంచడం వల్ల జిల్లాలోని ఆరు మండలాల్లో 175 గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు మండలాల్లో 369 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏడాది కాలంలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ లభ్యం కావడం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ, కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్ మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, తహసీల్దార్ రామారావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.


### జాబ్‌మేళాకు విశేష స్పందన

- ఉద్యోగాలకు 273 మంది ఎంపిక

నర్సీపట్నం : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ, యువతీ, యువకుల నుండి విశేష స్పందన లభించింది. 857 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కాగా 273 మంది ఎంపికైనట్టు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. జాబ్ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి సూచించారు. ఈ మేళాలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు, జాబ్ మేళా ఆర్గనైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

- దాడిలో గుమస్తాపై కత్తి వేటు
- ఏరియా ఆస్పత్రికి తరలింపు.. కేసు నమోదు
- దాడి చేసింది తెలుగుదేశం కార్యకర్త
- కేసు పెట్టవద్దని బాధితుడి భార్యకు టీడీపీ నేతల బెదిరింపులు



దాడిలో గాయపడిన మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు, గుమస్తా రాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు (ఇన్‌సెట్) గాయపడిన గుమస్తా రాజు

నర్సీపట్నం: రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావు, ఆయన గుమస్తా రాజులపై హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో శ్రీనివాసరావు స్వల్పగాయాలతో బయటపడగా.. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన గుమస్తా రాజు తలకు బలమైన గాయమైంది. శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె వినీల చైతన్య మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నారు. దాడి జరిపింది టీడీపీ క్రియాశీల కార్యకర్త కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. కేసు పెట్టవద్దని గుమస్తా రాజు భార్యను టీడీపీ నేతలు బెదిరించడం గమనార్హం. పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో శ్రీనివాసరావు కథనం ప్రకారం.. పూజకు అవసరమైన మర్రి ఆకులను తెచ్చేందుకు బైక్‌పై గుమస్తా రాజుతో కలిసి గురువారం ఉదయం శ్రీనివాసరావు బైక్‌పై వెళుతుండగా టీడీపీ క్రియాశీల కార్యకర్త అయిన రౌడీషీటర్ పప్పలనాయుడు, నవీన్ వారిని వెంబడించారు. శారదనగర్ సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద కత్తితో శ్రీనివాసరావుపై దాడి చేశారు. గుమస్తా రాజు అడ్డుకోవడంతో శ్రీనివాసరావు స్వల్ప గాయంతో బయటపడ్డారు. అయితే రాజు తలకు బలమైన గాయమైంది. జనం గుమిగూడేసరికి దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. గాయపడిన గుమస్తాను ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. వైఎస్సార్‌సీపీలో తాను చురుకైన పాత్ర పోషించడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు రౌడీషీటర్‌తో తనను హత్య చేయించేందుకు కుట్ర చేశారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుమస్తా అడ్డుకోకపోతే తనను చంపేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వ్యక్తులకు తనకు ఎలాంటి శతృత్వం లేదని ఆయన పేర్కొన్నారు. తన ఓనర్ శ్రీనివాసరావును నరికేందుకు కత్తితో దాడి చేస్తుండగా తాను అడ్డుకోవడంతో తలపై వేటు పడిందని పరామర్శించడానికి ఆస్పత్రికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు గుమస్తా రాజు వివరించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, ఏకా శివ, తమరాన శ్రీను, మామిడి శ్రీను, పెట్ల అప్పలనాయుడు బాధితులను పరామర్శించారు.

### బాధితుడి భార్యకు బెదిరింపులు

పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని టీడీపీ నాయకులు తనను భయపెట్టారని నర్సీపట్నం ఎస్సీ కాలనీకి చెందిన బాధితుడు రాజు భార్య దుద్దపూడి కనక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రౌడీషీటర్ పప్పలనాయుడు, నవీన్ అనే వ్యక్తులు ఉదయం 7 గంటల సమయంలో సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద తన భర్తపై కత్తితో దాడి చేశారని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లగా టీడీపీ నాయకులు ధనమిరెడ్డి మధు, బందారు కొండబాబు తన వద్దకు వచ్చి 'మీకు మాకు ఇంతవరకు గొడవలు లేవు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తే పరిస్థితి వేరేగా ఉంటుందని, మీరు జాగ్రత్తగా ఉంటే మంచిదని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని భయపెట్టార'ని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరి నుంచి తన భర్తకు, తనకు ప్రాణహాని ఉన్నందున వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని ఆమె ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

### కేసు నమోదు

బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన పప్పలనాయుడు, నవీన్‌లపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ఫిర్యాదుపై విచారణ జరుపుతామని వెల్లడించారు.

## క్లుప్తంగా

### బొజ్జన్నకొండ అభివృద్ధికి మీ సేవలు అభినందనీయం

- మాజీ ఎంపీ సత్యవతిని సత్కరించిన బుద్ధిస్ట్ సంఘాలు



మాజీ ఎంపీ బీవీ సత్యవతిని సత్కరిస్తున్న బుద్ధిస్ట్ సంఘాల ప్రతినిధులు

తుమ్మపాల : ప్రముఖ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ అభివృద్ధికి మాజీ ఎంపీ బి.వి.సత్యవతి ఎనలేని కృషి చేశారని, ఆమె సేవలు అభినందనీయమని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు అన్నారు. మాజీ ఎంపీ నివాసంలో గురువారం ఆమెను కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొజ్జన్నకొండ సందర్శకులకు, విదేశీ యాత్రికులకు కావలిసిన మౌలిక సౌకర్యాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.15.50 కోట్లు నిధులను రప్పించి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. బొజ్జన్న కొండకు లేజర్ లైటింగ్, బుద్ధుని చరిత్ర, బొజ్జన్నకొండ విశిష్టతలతో కూడిన చిత్ర ప్రదర్శన లేజర్ స్క్రీన్ థియేటర్, క్యాంటీన్ వంటి వసతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు పల్లా బాబ్జీ, బుద్ధిస్ట్ సొసైటీ గౌరవాధ్యక్షుడు నేలపూడి బాలరాజు, సిద్ధార్థ సంస్థ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయకార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, పూడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### జాతీయ హాకీ జట్టుకు ఇస్లాంపేట విద్యార్థిని

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అనిత బొహిపాయి జాతీయ హాకీ జట్టులో స్థానం సంపాదించుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌతమాపూర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 పోటీల్లో అనిత ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను హెచ్ఎం జి.ప్రమీల అభినందించారు.

# వింటర్‌లో రివ్వు రివ్వున





చలికాలం అంటేనే.. పర్యాటకులకు పండగ. అందుకు విశాఖపట్నం విమానాశ్రయం వింటర్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3 విమానాలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. మొత్తంగా ప్రతి రోజూ ఇక్కడి నుంచి 70 విమాన సర్వీసులు ఉండనున్నాయి. ఇందులో మూడు విదేశీ సర్వీసులు కావడం విశేషం.

- విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి రోజూ 70 విమాన సర్వీసులు
- ఈ ఏడాది మరో మూడు విమానాలు అందుబాటులోకి..
- వింటర్ షెడ్యూల్ విడుదల చేసిన వైజాగ్ ఎయిర్‌పోర్ట్
- అక్టోబర్‌లో పెరిగిన ప్రయాణికుల రాకపోకలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూల్ ఖరారైంది. శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ సీజన్‌లో విమానయాన సంస్థలు విమాన సర్వీసులను పెంచుతూ ఉంటాయి. గత సీజన్‌లో విశాఖ నుంచి 32 విమానాలు నడవగా.. ఈ ఏడాది 3 విమానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అంటే ఈ శీతాకాలంలో 35 విమానాలు ఇక్కడ నుంచి ఎగరనున్నాయి.

మొత్తంగా శీతాకాలం షెడ్యూల్ ప్రకారం సుమారు 70 విమాన సర్వీసులు వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించనున్నాయి. గతేడాదితో పోలిస్తే బెంగళూరుకి సర్వీసులు తగ్గగా.. ఈసారి హైదరాబాద్, విజయవాడకు సర్వీసులు పెరిగాయి. అదేవిధంగా 2023 శీతాకాలంలో విదేశాలకు ఒకే ఒక్క సర్వీసు (సింగపూర్) మాత్రమే ఉండేది. వేసవి కాలం నాటికి మలేషియా(కౌలాలంపూర్), బ్యాంకాక్‌కు అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. ఈ శీతాకాలంలో ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, జైపూర్, పోర్ట్‌బ్లెయిర్, కర్నూలు, కోల్‌కతా, తిరుపతి, ముంబై తదితర నగరాలకు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో కొన్ని ప్రతి రోజూ సర్వీసులుండగా.. మరికొన్ని వారంలో మూడు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నాయి.

**అక్టోబర్‌లో ప్రయాణికులు, విమాన సర్వీసుల రాకపోకలు**

| దేశీయ ప్రయాణికుల రాకపోకలు | |
|---|---|
| 2023 అక్టోబర్‌లో | 2,32,004 |
| 2024 అక్టోబర్‌లో | 2,52,499 |
| వృద్ధి రేటు | 8.83 శాతం |

| దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు | |
|---|---|
| 2023 అక్టోబర్‌లో | 1732 |
| 2024 అక్టోబర్‌లో | 1855 |
| పెరిగిన సర్వీసులు | 123 |
| వృద్ధి రేటు | 7.10 శాతం |

| అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు | |
|---|---|
| 2023 అక్టోబర్‌లో | 5175 |
| 2024 అక్టోబర్‌లో | 9576 |
| వృద్ధి రేటు | 85.04 శాతం |

| అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు | |
|---|---|
| 2023 అక్టోబర్‌లో | 35 |
| 2024 అక్టోబర్‌లో | 77 |
| పెరిగిన సర్వీసులు | 42 |
| వృద్ధి రేటు | 120 శాతం |

### అక్టోబర్‌లో అదరగొట్టింది

అక్టోబర్ నెలలో వైజాగ్ ఎయిర్‌పోర్టు అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకల పరంగానూ, విమాన సర్వీసుల పరంగానూ విశాఖ ఎయిర్‌పోర్టు మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2023 అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది 8.83 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. డొమెస్టిక్ విమాన సర్వీసుల విషయంలోనూ 7.10 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలోనూ అదే జోరు కొనసాగింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో 85.04 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో ఏకంగా 120 శాతం నమోదైంది. గతేడాదితో పోలిస్తే.అదనంగా రెండు సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.



### మరిన్ని సర్వీసులు పెంచేందుకు కృషి



వచ్చే మార్చి 29 వరకూ వింటర్ షెడ్యూల్ విడుదల చేశాం. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర విమానయాన శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపాం. దుబాయ్‌కు విమాన సర్వీసు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. డిజి యాత్రకు మంచి స్పందన లభిస్తోంది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాజారెడ్డి, వైజాగ్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

### నేటి నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

నక్కపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరుగుతాయని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. అండర్ 14 బాల బాలికల పోటీలు ఈ నెల 8 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు నక్కపల్లి హాకీ గ్రౌండ్‌లో నిర్వహించబడతాయన్నారు. ఈ పోటీలకు సుమారు 26 టీములు 13 జిల్లాల నుంచి 13 బాలురు, 13 బాలికలు టీములు మొత్తం జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలకు సుమారు 500 మంది క్రీడాకారులు 100 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో జాతీయస్థాయి జట్లు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమానికి హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి, అనకాపల్లి జిల్లా ఎంఈవో హాజరవుతారని తెలిపారు.

### అందరికీ క్యాన్సర్ పరీక్షలు



పాయకరావుపేట పీహెచ్‌సీలో క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ జ్యోతి

పాయకరావుపేట : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అందరికీ క్యాన్సర్ పరీక్షలు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జ్యోతి అన్నారు. పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన స్త్రీలు, పురుషులకు వారి ఇంటి వద్దనే ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సుభాష్, వి.ఎస్.సౌందర్య, ఎంపిహెచ్ఈవో పి.వి.రమణ, ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంగవరం పీహెచ్‌సీలో కూడా జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జి.స్వరాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కశింకోట: జిల్లాలోని గొలుగొండలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో హెల్త్ సూపర్ వైజర్ (గెస్ట్ ఫ్యాకల్టీ)గా పని చేయడానికి అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్టు విశాఖ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్. రూపవతి తెలిపారు. దరఖాస్తుతోపాటు సంబంధిత ఒరిజినల్, ఒక సెట్ నకలు సర్టిఫికేట్లతో ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు కశింకోట మండలం తాళ్లపాలెంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమోకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు. బీస్సీ నర్సింగ్‌గాని, జీఎన్ఎంగాని అర్హత కలిగి ఉండాలన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు విశాఖలోని తమ కార్యాలయంలోని ఫోన్ నంబర్ 0891–2799641కు సంప్రదించాలని కోరారు.



### రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ మృతి

- జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం వద్ద ఘటన
- గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు, (ఇన్‌సెట్) మృతుడు సింహాద్రి(ఫైల్)

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాలు. కోటవురట్ల మండలం రాట్నవానిపాలేనికి చెందిన మానేపల్లి సింహాద్రి(21) సబ్బవరం మీదుగా ద్విచక్రవాహనంపై కొత్తవలస వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సింహాద్రికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఇంటర్ పూర్తి చేసి, ఇంటి వద్దే ఉంటున్నాడు. తండ్రి కొండలరావు, తల్లి లక్ష్మి, పెళ్లైన అక్క ఉన్నారు. అక్క శ్రీకాకుళపు సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.దివ్య వెల్లడించారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



గోవింద మృతదేహం

బుచ్చెయ్యపేట : మండలంలో గల పి.భీమవరం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పోలేపల్లికి చెందిన తాళపు రెడ్డి గోవింద(39) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలేపల్లికి చెందిన గోవింద కొద్ది కాలంగా విశాఖపట్నం దగ్గర కంచరపాలెంలో నివాసం ఉంటూ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన నాగలచవితి సందర్భంగా పోలేపల్లి వచ్చాడు. కుటుంబ సభ్యులతో నాగుల చవితి సంబరాలు చేసుకున్న గోవింద ఆదేరోజు రాత్రి ఎల్‌బీ పురంలో ఉన్న తన చెల్లెలి ఇంటికి స్కూటీపై బయలుదేరాడు. బుచ్చెయ్యపేట దాటిన తరవాత పి.భీమవరం జంక్షన్ వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో గోవింద తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోవింద గురువారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### బైకు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మృతుడు కోర్రా గణపతి

మాడుగుల రూరల్ : మండలంలో మాడుగుల నుంచి ఖండివరం పోవు రహదారిలో ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో త్రీవ గాయాల పాలైన వ్యక్తి గురువారం రాత్రి విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రిలో మృతి చెందారు. చీడికాడ మండలం కోనాం శివారు గుంటి సమీపంలో గల బందవీధి గ్రామానికి చెందిన కోర్రా గణపతి (30) ఈ నెల 4న కోనాం నుంచి ఖండివరం మీదుగా మాడుగుల వస్తుండగా, మాడుగుల నుంచి ఖండివరం వైపు వెళ్తున్న కింతలి వల్లాపురం శివారు పణుకు గదబవీధికి చెందిన సుకూరు అప్పారావు ఇరువురు బైక్‌ల మీద వెళుతూ ఖండివరం – మాడుగుల రహదారిలో మోసూరి వారి కళ్లాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొట్టారు. దీంతో గణపతి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పారావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. త్రీవంగా గాయపడిన గణపతిని అదే రోజు అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ జి. నారాయణరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### విద్యార్థినులతో పనులు చేయించొద్దు

- బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే, అధికారుల విచారణ



ప్రధానోపాధ్యాయిని హిమబిందును ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో తరగతి గదులు ఊడ్పించడంపై పత్రికల్లో వచ్చిన వార్తలపై నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి పి. అప్పారావు, ఎంఈవోలు వై.మీనాక్షి, అరుణ్‌కుమార్ గురువారం విచారణ జరిపారు. ప్రధానంగా 7వ తరగతిలో బాలికలను గదులు తుడిపించడంపై ఆరా తీశారు. మీరంతా చదువుకోవడానికి పాఠశాలకు వస్తున్నారని, ఎవరూ పనులు చేయవద్దని ఎమ్మెల్యే బాలికలకు చెప్పారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం, టాయిలెట్లు పరిశీలించారు. ప్లస్–2 విద్యార్థినుల తరగతికి వెళ్లి ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడారు. మాకు ఇంగ్లిషు లెక్చరర్ లేరని, పరీక్షలు దగ్గరపడుతున్నందున వెంటనే అధ్యాపకురాలిని నియమించేలా చూడాలని విద్యార్థినులు కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఇంగ్లిషు లెక్చరర్‌ను నియమించాలని డీఈవో అప్పారావునాయుడుకు ఫోన్ చేసి చెప్పారు. అదేవిధంగా మరో స్వీపర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థినులతో వెట్టి చాకిరీ అంశంపై విచారణకు వచ్చిన యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు, ఇద్దరు ఎంఈవోలు పాఠశాలలో విద్యార్థినులు, ప్రధానోపాధ్యాయురాలు, టీచర్ల నుంచి రాతపూర్వక వాంగ్మూలాలు సేకరించారు.

**హెచ్ఎంకు స్వల్ప అస్వస్థత**

ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.వి.హిమబిందు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

### విద్యార్థులతో వెట్టి చాకిరీపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

తుమ్మపాల : విద్యార్థులతో తరగతి గదులు, ఆటస్థలంలో పనులు చేయించిన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డీఆర్వో బి.దయానిధి, డీఈవో కార్యాలయాల్లో గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ యలమంచిలి మండల ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థుల పరిస్థితిపై అధికారులకు వివరించామన్నారు. పాఠశాల పరిశుభ్రతకు స్వీపర్స్‌ను నియమించినప్పటికీ ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అందరి సమన్వయంతో పార్టీ బలోపేతం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్టీ నేతలు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడతాం
- కార్యకర్తలకు పెద్ద పీట వేస్తాం
- 2027 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

విశాఖ సిటీ : ఉత్తరాంధ్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని సమన్వయం చేసుకుంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తర్వాత ఆయన విశాఖలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో గురువారం లాసెన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వై.వి. సుబ్బారెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేశారని, దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. గతంలో పాలన చేసిన అనుభవంతో ఉత్తరాంధ్రలో పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వారితో మమేకమయ్యేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ అంశంలో చంద్రబాబు చెతులెత్తేశారని, వైఎస్సార్ సీపీ మాత్రం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు.. ఇలా అందరిని సమన్వయం చేసుకుంటూ.. 2027 చివరిలో జరిగే ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు. గతంలో పార్టీ కార్యకర్తలను విస్మరించిన మాట వాస్తవమే అని.. ఇప్పుడు వారికి పూర్తి ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, కె.భాగ్యలక్ష్మి, శోభ హైమావతి, పి.వరలక్ష్మి, సమన్వయకర్తలు కేకే రాజు, మలసాల భరత్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల రవికుమార్(రవిరెడ్డి), ఉరుకూటి అప్పారావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయం సందర్శన**

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి తొలిసారిగా సందర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

### పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణం తగ్గించాలి



విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్‌లో నిరసన

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం విద్యుత్‌ఛార్జీలు పెంపు విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఒక రోజు నిరసన దీక్ష గురువారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, 30శాతం ఛార్జీలు తగ్గిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఐదు మాసాల్లోనే సర్దుబాటు ఛార్జీలు పేరిట రూ.18వేల కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం మోపడం అన్యాయమన్నారు. పెంచిన ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గల సమన్వయకర్తలు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, అనంతరావు, కచ్చాల చినబాబు, పీసీసీ సభ్యుడు తుట్టా రమణ, మాజీ ఎంపీటీసీ కాళ్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు బోయిన బానుమూర్తియాదవ్, విన్నకోట రాము, సేనాపతి రాజు, కె.శ్రీధర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వయోవృద్ధుల సమావేశం రేపు

**అనకాపల్లి:** జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్లో శనివారం ఉదయం 10 గంటలకు జరగనుందని సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు.

### నిలకడగా కూరగాయల ధరలు

**కశింకోట:** కశింకోట వారపు సంతలో కూరగాయలు దాదాపుగా గురువారం స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో బంగాళాదుంప, దొండకాయ, రూ.40, ఉల్లి, టమాటా రూ.50, చేమ దుంప, వంకాయ, కాకరకాయ, క్యారెట్ రూ.60, క్యాప్సికం, చిక్కుడు రూ.100కు విక్రయించారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

**అనకాపల్లి:** స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు ప్రాంతానికి చెందిన వరహా శ్రీనివాసరావు 10 మద్యం క్వార్టర్ బ్యాటిళ్లు తరలిస్తూ పట్టణ పోలీసులకు గురువారం పట్టుబడ్డాడు. ఈ మేరకు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ మద్యం బ్యాటిళ్లను స్వాధీనం చేసుకుని, శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### విద్యార్థిని అదృశ్యం

**అనకాపల్లి:** స్థానిక ఉడ్పేటకు చెందిన 16 సంవత్సరాలు విద్యార్థిని అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు.. ఉడ్పేటకు చెందిన విద్యార్థిని గురువారం ఉదయం బయటకు వెళ్లి వస్తామని చెప్పి తిరిగిరాలేదు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

**కశింకోట:** మండలంలోని బయ్యవరం రైల్వే స్టేషన్ రోడ్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధురాలు గాయపడింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఆటోను వెనక నుంచి వ్యాన్ వచ్చి ఢీకొంది. దీంతో ఆటో పక్కనున్న డివైడర్‌పైకి దూసుకుపోయి ఆగింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలు గాయపడింది. ఆమెను ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు. స్వల్ప గాయాలు కావడంతో ఆటో, వ్యాన్ డ్రైవర్లు రాజీపడి వెళ్లిపోయారు. దీంతో కేసు నమోదు కాలేదని తెలిసింది.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 882బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,100 | 4,530 |
| మొదటి రకం | 3,900 | 4,580 |
| రెండో రకం | 3,480 | 4,130 |
| మూడో రకం | 3,000 | 3,450 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| దేవర | : రాజా |
| 'క' | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| అమరన్ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| అప్పుడో ఇప్పుడో ఎప్పుడో | : పర్తిసాయి |
| బ్లడీ బెగ్గర్ | : షిర్డిసాయి |
| ధూం ధాం | : వెంకటేశ్వర |
| విశ్వం | : శ్రీసత్య |
| లక్కీ భాస్కర్ | : రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 352 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చును.



# సచివాలయ వ్యవస్థకు చంద్ర గ్రహణం.!

- వెబ్‌సైట్లు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- పట్టణ, గ్రామీణ ప్రజలకు దూరమవుతున్న ప్రభుత్వ సేవలు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ మళ్లీ ప్రదక్షిణలు మొదలు



ఏఎంసీ కాలనీ సచివాలయంలో ఆధార్ సెంటర్(ఫైల్)

**అనకాపల్లి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థకు కూటమి సర్కారు వెన్నుపోటు పొడుస్తోంది. ఎన్నికల ముందు సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు తన మార్కు రాజకీయం చూపిస్తూ నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ఇప్పటికే ఇంటింటికి దగ్గరైన వలంటీర్ వ్యవస్థను ప్రజలకు దూరం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు సచివాలయ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ నిర్ణయాలు తీసుకుంటున్న ఘటనలు ఇటీవల చోటు చేసుకున్నాయి. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ జయంతి రోజున ప్రతి 2 వేల మంది జనాభా కలిగిన గ్రామానికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలు, రైతులకు, విద్యార్థులకు, మెరుగైన సేవలు అందించారు. కూటమి పాలనలో ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సచివాలయం ఉద్యోగులకు సామాజిక పింఛన్ల పంపిణీ తప్ప ఎటువంటి విధులు అప్పగించపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

**ప్రతి సచివాలయంలో 11 మంది విధులు**

పట్టణ, మండలం పరిధిలో 53 సచివాలయాలు ఉండగా.. ఒక్కొక్క సచివాలయంలో 11 మంది శాశ్వత ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. ప్రతి సచివాలయంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష, సర్వేయర్లు, వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేసేవారు. ప్రతి సచివాలయంలో సుమారుగా 540 సర్వీసులను పైగా ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు సకాలంలో అందించి ఉద్యోగులు అందరి మన్ననలు పొందారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు సకాలంలో అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 5 మాసాలు పూర్తవుతున్నప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు నేటికి ఒక్క రూపాయి కూడా అందజేయక పోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆ సందడేది?**

అప్పటి సీఎం వైఎస్ జగన్ పట్టణ, మండలంలో 53 సచివాలయాలకు శాశ్వత భవనాలు సమకూర్చారు. రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20 నుంచి రూ.80లక్షల నిధులతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు ఆయా ప్రాంతాల ప్రజలతో సందడిగా ఉండేది. ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు మళ్లీ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సచివాలయ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవిష్యత్**

కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి, వివిధ రకాల సర్వేలకు మాత్రమే వాడుకుంటుంది. ఇంటింటికి వెళ్లి గోడలపై ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కర్లను అతికించడానికి మాత్రమే పరిమితం చేసి ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసింది. వలంటీర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, సచివాలయం ఉద్యోగులతో ఆ పనులు చేయిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 90 నుంచి 95 శాతం వివిధ రకాలైన పింఛన్లు అందజేస్తున్నామని గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం.. అందుకు సచివాలయ వ్యవస్థ అన్న విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.





అనకాపల్లి మండలంలో కొత్తూరు సచివాలయం

### వెబ్‌సైట్‌లు పని చేయడం లేదని పంపేశారు..



కొత్తూరు సచివాలయానికి వెళ్లి ఇంటి స్థలం కోసం దరఖాస్తు అందజేశా. ప్రస్తుతం పాత గవర్నమెంట్ వెబ్‌సైట్‌లు ఏవీ పని చేయడం లేదని సచివాలయ ఉద్యోగులు చెప్పారు. ప్రభుత్వం ఏమైనా ఆదేశాలు జారీ చేస్తే ఇంటి స్థలం కోసం చెబుతామని పంపించేశారు. గతంలో ఈ సచివాలయంలో అన్ని సేవలూ అందుబాటులో ఉండేవి. ఎంతో బాగుండేది.

– బి.నూకరత్నం, కొత్తూరు, అనకాపల్లి మండలం

### రేషన్‌కార్డు కోసం వెళ్లా.. పనికాలేదు..



పాత రేషన్ కార్డులో నా కుమరుడితో పాటు నేను, నా భర్త ఉన్నాం. ఏడాది క్రితం నా కుమారుడికి వివాహమైంది. నా రేషన్ కార్డు నుంచి నా కుమారుడ్ని తొలగించి, కొత్తగా రేషన్‌కార్డు కోసం సత్యనారాయపురం సచివాలయానికి వెళ్లి సంప్రదించాం. ప్రస్తుతం గవర్నమెంట్ సైట్లు ఏవీ పని చేయడం లేదని చెప్పడంతో ఏమీ చేయాలో అర్థం కాలేదు. ప్రభుత్వాలు మారితే వెబ్‌సైట్లు ఆపేయడం విడ్డూరంగా ఉంది.

– అల్లవరపు గౌరీ, సత్యనారాయణపురం

## 11న భవన నిర్మాణ కార్మికుల ధర్నా



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్.కొండలరావు, తదితరులు

**అనకాపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు శ్రీగౌరీ శంకర్ తాపీ మేస్త్రీల సంఘం(ఏఐటీయూసీ) మండల అధ్యక్షుడు ఎస్.కొండలరావు తెలిపారు. మండలంలో కూండ్రం గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుకను ప్రభుత్వమే అన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ద్వారా సరఫరా చేయాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలన్నారు. బోర్డు నుంచి గతంలో దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డుపై మొదటి సంతకం పెడతామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రజల నుంచి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జె.రామారావు, ఎస్.సూరిబాబు, కె.అప్పలనాయుడు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ నాయకుడు రమేష్‌కు ఘన నివాళి

**తుమ్మపాల:** సీఐటీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్ వర్ధంతి కార్యక్రమం సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి కార్మిక ఉద్యమానికి రమేష్ అంకితమయ్యారని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న సమయంలో రమేష్ లేని లోటు కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు, జిల్లా గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం చైర్మన్ గంటా శ్రీరామ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్యకళ, ఉమా మహేశ్వరరావు, అల్లు రాజు, ఐద్వా నాయకులు జి.సుభాషిణి పాల్గొన్నారు.



రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

**కశింకోట:** సీఐటీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత ఎస్.రమేష్ వర్ధంతి కార్యక్రమం కశింకోటలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే క్యాన్సర్ నివారణ



కశింకోట పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

**కశింకోట:** అవగాహనతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుమలరావు అన్నారు. కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట పీహెచ్‌సీలో క్యాన్సర్ వ్యాధి పట్ల ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వారు అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. తిరుమలరావు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, పీహెచ్ఎన్ సత్యవతి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- తాళ్లపాలెం పీహెచ్‌సీలో కూడా క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ముందస్తు పరీక్షలు-సత్వర చికిత్స ద్వారా క్యాన్సర్ నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఆర్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఏవీ సుబ్బారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మపాల గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**అనకాపల్లి:** గ్రామాల్లో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు చేస్తామని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణీ జగదీశ్వరి తెలిపారు. మండలంలో తుమ్మపాల గ్రామంలో జాతీయ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.సంఘం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి

**తుమ్మపాల:** పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిన్నియాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ అధికారి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ పెద్ద హైస్కూళ్లలో దశాబ్దాల కాలం నుంచి ఉన్న ఎన్‌సీసీ ఎత్తివేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని స్కూళ్లలో తరగతులు సరిగా జరగడం లేదని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ అమలు కావడం లేదని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకులు బొడ్డు సోమరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, మత్స్యకారుల సంఘం నాయకులు వాసిపల్లి తాతయ్యలు, నటభూషణ శోభన్ బాబు సేవా సంస్థ చైర్మన్ ముగడ అప్పారావు, దళిత సంఘాల జిల్లా నాయకుడు కొల్లి సత్యారావు, బ్రాహ్మణ సంఘం నాయకుడు సత్యసాయిబాబా పాల్గొన్నారు.

## డీఈవోకు అభినందనలు

**అనకాపల్లి:** స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావును గురువారం జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తట్టా కృష్ణ, బి.అచ్యుతకృష్ణ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.నూకేశ్వరరావు, ఎం.వరప్రసాద్, పీలా నాగు, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో అప్పారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ

**సింహాచలం:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు మనవాళ మహామునుల తిరునక్షత్రం సందర్భంగా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన విషయం తెలిసిందే. గురువారం నుంచి వీటిని పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## సింహాచలం నుంచి పంచారామాలకు బస్సులు

**సింహాచలం:** కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల్లో వచ్చే ఆదివారా(10, 17, 24 తేదీ)ల్లో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు సోమవారం రాత్రి తిరిగి చేరుకుంటాయన్నారు. అమరేశ్వరస్వామి(అమరావతి), సోమేశ్వరస్వామి(భీమవరం), క్షీరా రామలింగేశ్వరస్వామి(పాలకొల్లు), భీమేశ్వరస్వామి(ద్రాక్షారామం), కుమార రామలింగేశ్వరస్వామి(సామర్లకోట) క్షేత్రాలను దర్శించుకునేలా ఈ బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్‌లో ఒకరికి రూ.2,100, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో రూ.1,650 టికెట్‌గా నిర్ణయించామన్నారు. సింహాచలం ఆర్టీసీ డిపోలో టిక్కెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. గ్రూప్‌గా బుక్ చేసుకున్న వారి సౌకర్యార్థం ఇంటి వద్దకే బస్సుని పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. గ్రూప్ బుకింగ్‌లు చేసుకుంటే అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరకు, బొర్రాగుహలు, పాడేరు, లంబసింగిలకు బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు డిపో అసిస్టెంట్ మేనేజర్(799720493), ట్రాఫిక్ సూపర్‌వైజర్(7382917295)లను సంప్రదించాల్సిందిగా కోరారు.

### 10న జిల్లా స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

**మునగపాక:** మండలంలోని తిమ్మరాజుపేటలోని డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో ఈ నెల 10న జిల్లా స్థాయి స్విమింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరయ్య, సీహెచ్ దేముడులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9573690954 ఫోన్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

### నేడు సినిమా షూటింగ్ ప్రారంభం

**కశింకోట:** మండలంలోని నరసింగబిల్లిలో కొత్త నటులతో నిర్మించనున్న సినిమా షూటింగ్ గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్టు నిర్వాహకుడు పల్లా తాతారావు, తెలిపారు. పైలంపూడి దర్శకునిగా వ్యవహరిస్తారన్నారు. షూటింగ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ హాజరవుతారన్నారు.

### కశింకోటలో పడమటమ్మ దీక్షలు

**కశింకోట:** కశింకోటలో గురువారం పలువురు పడమటమ్మ దీక్షలు చేపట్టారు. ఈ నెల 21న పడమటమ్మ పుట్టుక మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తి భావంతో స్థానిక ఉప్పు నీటి దిబ్బ ప్రాంతంలో అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహించారు.

### గ్రావెల్ లారీకి జరిమానా

**కశింకోట:** మండలంలోని జి.భీమవరం వద్ద అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీని గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఉప తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. లారీని మైన్స్ అధికారులకు అప్పగించగా రూ.25 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

### రెవెన్యూ సదస్సుకు 87 అర్జీలు



సింగవరంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

**కశింకోట:** సింగవరంలో గురువారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో 87 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు, రీసర్వేలో లోపాలు, భూముల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పేర్ల సవరణ తదితర అంశాలపై రైతులు అర్జీలు అందజేశారు. రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, సర్వేయర్ రామారావు, రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 104 సిబ్బందికి జీతాలు చెల్లించండి



కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగదివ్యకు వినతి పత్రం అందజేస్తున్న కింతలి 104 సిబ్బంది

**మాడుగుల రూరల్:** ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్న 104 సంచార వాహన సిబ్బందికి మూడు మాసాలుగా జీతాలు ఇవ్వక పోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కింతలి పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న 104 సిబ్బంది గురువారం స్థానిక వైద్యాధికారి నాగదివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంచార వాహనాలు గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 మాసాలు జీతాలు వెంటనే చెల్లించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నెంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ కింతలి పీహెచ్‌సీ పరిధిలో 104 సంచార వాహనం డేటా ఎంట్రీ ఆపరేటర్ ముమ్మిన గంగాధర్, డ్రైవరు ఎస్. భార్గవ్‌లు వినతిపత్రం అందజేశారు.

## 26వ రోజుకు అభిజిత్ కార్మికుల నిరసన



అభిజిత్ పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

**అచ్యుతాపురం:** అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ పరిశ్రమను వెంటనే పునః ప్రారంభించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం నిరసన తెలిపారు. 26 రోజులుగా ఆందోళన చేస్తున్నా కంపెనీ లే ఆఫ్ ఎత్తివేయడం లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల బకాయిలు చెల్లించి కంపెనీ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జి.కోటేశ్వరరావు, రాము, సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.